# ★ తీరని కోరిక ★

పంకజం, భాస్కరం ఒకే హైస్కూలులో చదువుకున్నారు, స్కూలు ఫైనల్ దాకా. భాస్కరం కాలేజీలో చేరాడు. పంకజం చదువును తండ్రి మాన్పించి వేశాడు. స్కూలులో చదివిన పరిచయం వల్ల అప్పుడప్పుడు పంకజం ఇంటికి భాస్కరం వస్తూ పోతూ ఉండేవాడు. కాలేజీలో ముచ్చట్లు తీసుకువచ్చి చెబుతూ ఉండేవాడు పంకజానికి. పంకజం వాటిని వింటూ 'తాను కూడా కళాశాలలో చదువలేకపోతినే' అని మనస్సులో నిట్టూరుస్తూ ఉండేది. ఒకప్పుడు తాను చదువకపోయినా, భాస్కరం కబుర్లు వింటూ ఉంటే, తానూ చదువుతూ ఉన్నట్లే భావిస్తూ ఉండేది.

పంకజం, పేదకుటుంబంలో పుట్టినా ఆమె తెలివితేటలూ చక్కదనమూ పరిమితమైన బంధువర్గంలో బాగానే పరిమళించాయి. ఫలితంగా కట్నం అక్కరలేకుండా పెళ్ళిచేసుకుంటాననే వరుడు దొరికాడు. అతను ఏమీ అనాకారి కాడు. ఆంగ్లంలో పెద్దక్లాసులు పరీక్ష ఇచ్చినవాడే. ఇంత మంచి సంబంధం వారికి వారుగా వస్తూ ఉంటే, వీరికి కాకాలొడ్డలేకపోయాడు పంకజం తండ్రి. తనకున్న శక్తిలో, ఘనంగానే వివాహంచేశాడు. వాళ్లు ఉన్నవాళ్ళే అయినా 'పెళ్ళికూతురువారిని' తేలికగా చూడడం గాని, పేచీలు పెట్టడంకాని, చేయకుండా మూడు ముళ్ళూ పడగానే పిల్లను తీసుకుపోయి, వేడుకలన్నీ వారి యింటనే జరుపుకున్నారు.

పంకజం భాస్కరంతో తన పెళ్ళి విషయం చెప్పింది. తన పెళ్లి విషయం సాధారణంగా ఏ పెళ్ళికూతురూ చెప్పదు. అయితే చెప్పేవాళ్ళుకూడ లేకపోలేదు. చెప్పేవారు సిగ్గు విడచి చెప్పరు. పైగా సిగ్గుపడుతూనే, కేవలం చెప్పినట్టు గాకుండా చెబుతారు. పంకజం అల్లాగే ముభావంగా చెప్పింది. పంకజానికి తనకు మంచి సంబంధం వచ్చిందనే సంతోషం లోపల లేకపోలేదు. కాని చెప్పే తీరులో ఏదో హృదయంలో బరువు కూడ ఉంది. సంబంధం వివరాలన్నీ అంతకు ముందే తెలుసుకున్న భాస్కరం, పంకజాన్ని అదృష్టవంతురాలని అభినందించాడు. కాని ఆ అభినందనాన్ని తాను నిండుహృదయంతో చేయడంలేదని తెలుసుకున్నప్పుడు, కొంత సిగ్గూ, కొంత బాధపడ్డాడు. పంకజం తన తండ్రిచేత భాస్కరాన్ని వివాహానికి రావలసిందిగా బలంగా చెప్పించింది. ఆ పెళ్ళిలో భాస్కరం ఒళ్ళు విరుచుకు పని చేశాడు; వడ్డించడం, 'పెళ్లికొడుకువారి'కి సౌకర్యాలు కల్పించడం వగైరా పనుల్లో. పెళ్ళికొడుకు చిట్టాలోకూడ భాస్కరం ఆడపెళ్ళివారి తరఫున జమపడ్డాడు.

తర్వాత నాలుగైదేళ్ళదాకా పంకజం పుట్టింటికి రానే లేదు. అత్తవారింటిదగ్గరే ఉండిపోయింది. పునస్సంధానంకూడ వారింటిదగ్గరనే జరిగింది. పంకజం తండ్రినీ, తల్లినీ, వారే ఆహ్వానించారు. ఆ కాలంలో పంకజం బి.ఏ. పూర్తిచేసింది. భర్తకు ఉద్యోగం అయినా, అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉండేవాడు కాని, భార్య చదువు చెడిపోతుందని వేరే కాపురం పెట్టలా. బి. ఏ. ప్యాసయేనాటికి పంకజానికి నీళ్ళుపోసుకుని అయిదు నెలలు.

పుట్టింటివారు పురుడుపోయడానికి తమ ఊరు తీసుకువెళ్ళారు పంకజాన్ని. ఈ నాలుగైదు సంవత్సరాలకాలంలో భాస్కరాన్ని గురించి ఒకటి, రెండు ఉత్తరాలు తండ్రికి

**పెడిపాటి సుబ్బరామశాస్త్రి**

వ్రాసినా—అతడు క్షేమంగా ఉన్నాడని, వివాహం చేసుకున్నాడనీ తప్ప వేరే వివరాలేమీ పంకజం తెలుసుకోలేకపోయింది. తన చదువు గొడవల్లో తానుంటూ అత్తగారింటి వాతావరణంలో అతుక్కుపోయినా, ఒకటి రెండుసార్లు భాస్కరానికే స్వయంగా క్షేమసమాచారాలకై ఉత్తరాలు వ్రాద్దామనుకుంది. కాని అల్లా వ్రాయడం మంచిది కాదేమోనని మానేసింది. పుట్టింటికిరాగానే మొట్టమొదట జ్ఞప్తికివచ్చింది భాస్కరం, తన చిన్నతనంలో చదువుకున్న రోజులూ. ఇప్పుడు తాను బి. ఏ. ప్యాసయింది తండ్రిచేత భాస్కరానికి కబురు పెట్టింది. ఎమ్. ఏ. చదువుతూ సెలవలకు వచ్చిన భాస్కరం, వచ్చి పంకజాన్ని చూశాడు.

పంకజం భాస్కరాన్ని అడిగింది, అతని పెళ్ళికి తనకు ఆహ్వానం పంపలేదేమని. భాస్కరం సిగ్గుపడ్డాడు. నిజంగా ఆహ్వానం పంపుదామని అతనికి స్ఫురించింది. చిరునామా కూడా ఏమీ తెలియనిది కాదు. అప్పుడప్పుడు పంకజం తండ్రితో తను మాట్లాడుతూ తెలుసుకుంటూనే ఉన్నాడు. లాంఛనంగా తాను పంపడమే కాని భాగ్యవంతుల యింట్లో పడ్డ పిల్ల, ఏదో చిన్ననాటి సహపాఠి వివాహానికి వస్తుందా అని మానివేశాడు. ఇప్పుడు పంకజం ప్రశ్నించే వైఖరి చూస్తే తన వివాహానికి ఆమె వచ్చేదేమో అనిపిస్తోంది అతనికి. ఆ ఆసక్తి ఆమెకు ఉన్నట్లు గమనించగలిగాడు భాస్కరం. సమాధానం ఎల్లా చెప్పాలో అతనికి తోచలేదు ఇల్లా అన్నాడు: "పంకజం! నీవు రాదగినంత విశేషంగల పెళ్ళి కాదులే."

"అదేం" అంది పంకజం.

"పెళ్లికూతురుకు నేనే సంతోషించకపోతే, ఆ పెళ్ళికి నువ్వేం సంతోషిస్తావ్?"

ఈ మాటలు వినగానే 'పాపం!' అనుకుంది మనస్సులో పంకజం. కాని వెంటనే ఒక ఊహ కదలింది. 'అందరికీ వచ్చినవాళ్ళే వివాహమవుతారా!' అని. 'మరి తనకో?' కొద్దిగా కలవరపడింది.

"పురుడు వెళ్ళేదాకా ఉంటావుకాదూ—పంకజం!" అన్నాడు భాస్కరం. పంకజం అనుకుంది "ఇదేం ప్రశ్న—పురుడు పోసుకోవడానికి వచ్చినవాళ్ళు పురుడు వెళ్ళేదాకా ఎందుకుండరు?" అతని ముఖం వంక చూచింది. అతనిముఖం ఎందుకో విచారంగా వుంది. అతడు విచారపడుతూ ఉంటే తనకూ విచారంగా ఉన్నట్లనిపించింది. నాలుగయిదేళ్లు గడచిన తర్వాత ఇద్దరూ కొత్తవారు—లోకం ప్రకారం పలకరించుకున్నట్లయిపోయారు.

"నీకు సెలవు లయిపోయినయ్యా!" అంది పంకజం.

"ఇంకా నాలుగురోజు లున్నై. ఎల్లుండి వెళ్లాలనుకుంటున్నాను."

"అవతలెల్లుండి వెడుదువుగానిలే—ఎల్లుండి మాయింటికొస్తావు కాదూ?"

ఈ వాక్యం రమ్మని పిలచినట్లుగా గాకుండా అధికారాన్ని చలాయించినట్లుగా వుంది.

"వస్తా—పంకజం!" అన్నాడు భాస్కరం నెమ్మదిగా.

అన్న ప్రకారం ఆ రోజున భాస్కరం పంకజం ఇంటికివెళ్లాడు. ఆ రోజునే హఠాత్తుగా పంకజం భర్త 'మిళింద కుమార్' వచ్చాడు. ఎప్పుడో పెళ్ళిలో చూసిన భాస్కరాన్ని తనభర్తకు పరిచయం చేసింది పంకజం. చాలాసేపు కులాసా కబుర్లు చెప్పుకున్న తర్వాత, తనూ తనభర్త మర్రోజు భాస్కరం ఇంటికి వస్తామని పంకజం చెప్పేసింది భాస్కరానికి. పంకజం తన భార్యను చూడడానికే వస్తోందని గమనించిన భాస్కరం సిగ్గుపడ్డాడు. తాను ఎల్లా కాదనగలడు వస్తామన్న వారిని? పైగా ఆమె సభర్తృకంగా వస్తానంటూ ఉంటే ఏదయినా కాఫీ ఏర్పాటు చేయవలసి వస్తుందని ఊహించుకుంటూనే "తప్పకుండా రండి!" అని మిళింద

కుమార్ కు మరీమరీ మర్యాదతో చెప్పి వెళ్లిపోయాడు భాస్కరం.

మరురోజు పంకజం భర్తను బయలుదేర తీసింది. భాస్కరం తాను ఎరుగున్న వాడనీ, కలసి చదువుకున్నామని చెప్పింది. అంతే కాక పెళ్లిలో పెళ్లివారికి వడ్డించడం మొదలయిన విషయాలు జ్ఞాపకం చేసింది. భర్త చేత ఓ మంచి కంచి పట్టుచీర, రవికల గుడ్డా కొనిపించింది, తాను చూడబోయే భాస్కరం భార్యకోసం.

పంకజం, మిళిందకుమార్, తన ఇంటికి రాగానే భాస్కరం పొంగిపోయాడు. ఫలహారం కాఫీ ఏర్పాటు చేశాడు. ఇవన్నీ భార్యచేతనే చేయించాడు తప్పనిసరిగా. తన భార్యను చూడడానికి వస్తే—ఇంట్లో మరొకరిచేత చేయిస్తే పంకజం ఏమయినా అనుకోదూ.

తాంబూలచర్వణం కూడా అయినతర్వాత పంకజం తాను తెచ్చిన కానుక భాస్కరం భార్యకు బొట్టుపెట్టి యిచ్చింది. "పెళ్ళికి మిమ్మల్ని పిలవక పోయినా—ఇప్పుడైనా చూశాం. మా భాస్కరం లక్షణమైన పిల్లను చేసుకున్నాడు," అంది పంకజం. వెంటనే 'ఏమండీ' అని భర్తవంక చూసింది.

"నిజం, నిజం"—అన్నాడు మిళిందకుమార్.

"ఏది నిజం! పెళ్లికి పిలవక పోవడం మాత్రమే నిజం" అనుకున్నాడు భాస్కరం. మిళిందకుమార్, భాస్కరం ఏవో కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు. పంకజాన్ని భాస్కరం భార్య ఇంట్లోకి తీసుకు వెళ్లింది. బొట్టుపెట్టి రవికలగుడ్డ ఇచ్చింది. ఇంతట్లో ఆమె కన్నులలో నీళ్లు గిర్రున తిరిగాయి. పంకజం ఆమె కన్నులలోకి చూచింది. కౌగలించుకుని "ఇదేమిటే పిచ్చిపిల్లా!" అంది.

"ఇవాళ నా పుణ్యం మంచిది మీరు వస్తారని నాతో వారికి మాట్లాడక తప్పింది కాదు. నేను అందంగా లేకపోతే నన్ను చేసుకోడం మానివేయవచ్చు. కాని చేసుకుని కోతి పెడితే, ఆడదానిగతి అధోగతే కదా" అంది.

పంకజం ఆడది. తనయెదుట ఒక ఆడది భర్తృతిరస్కృతి. భర్త తిరస్కరిస్తే భార్య వేదన ఎల్లావుంటుందో కొంత ఇప్పుడు తను చూడగలిగింది. తాను ఎంతో అదృష్టవంతురా లనుకుంది.

"విచారించకు. లిఖితం ఎక్కడ వుంటే అక్కడే వివాహం అవుతుంది. చేసుకున్న తర్వాత ఉసురు పెట్టకూడదు;" అంది.

"నాకు చదువు రాదని ఎప్పుడూ విసిరి కొడుతూ ఉంటారు మా పినతల్లి కూతురు బి యే. ప్యాసయింది. ఉద్యోగం చేస్తోంది. ఎప్పుడూ మొగుణ్ని విసిరి కొడుతూనే ఉంటుంది మగవాడు కుక్కినపేనల్లే పడి ఉం









# తీరని కోరిక

టాడు. పాపం! అతన్ని చూస్తే నాకు జాలి వేస్తుంది. నాకు చదువు రాకపోవడం తనకు మంచిదేగా," అన్నది.

పంకజానికి నవ్వు వచ్చింది. చదువు స్వరూపం ఆమె ఎలా అర్థం చేసుకుందో, ఆమె ఎంత అమాయికమైనదో అర్థమైంది. తనను ఏమీ ప్రశ్నించక పోయినా, ఏదో చెప్పవలసి ఉన్నట్లు ఆమె కన్నులు కాంక్షిస్తున్నై. తాను కూడా చదువుకున్నదనీ, చదువుకున్న ఆమెతో మాట్లాడుతున్నాననే ఇంగితం భాస్కరంభార్యకు కలగలేదని ఆశ్చర్యపడింది. ఐతే ఆమె ఒక వేదనలో తనతో ప్రసంగించడంలో ఆమాటఎంతదూరం పోతుందో ఊహించుకో లేక పోవడంకూడా సహజమేనని సరిపెట్టుకుంది.

ఇంతలో మిళిందకుమార్ పిలవడంతో పంకజం బయటికి వచ్చేసింది. వాకిలి దాకా భాస్కరం, భార్యా, సాగనంపారు. పంకజం ఎన్నో సార్లు 'వెళ్ళివస్తా'నని భాస్కరం భార్య భుజాన్ని తట్టి మరీ సెలవు తీసుకుంది. "ఆడవాళ్ళ కింతలో స్నేహం కలసిపోతుంగా." అన్నాడు మిళిందకుమార్ నవ్వుతూ. "మళ్ళీ వెళ్ళిపోతావు కాబోలు, రేపొకసారి మాయింటికేసిరా, భాస్కరం," అన్నది పంకజం. భాస్కరం 'సరే'నని తల ఊపి వెనక్కి తగ్గాడు.

పంకజం, మిళిందకుమార్, కలిసి వారి ఇంటికేసి నడిచి వెడుతున్నారు.

"ఏమిటి పంకజం! లక్షణమైనపిల్ల, అని నాచేత కూడ సర్టిఫికేట్ ఇప్పించావూ. ఆపిల్ల అంతబాగుందా?" అన్నాడు మిళింద కుమార్.

"ఏమో నిజం, నిజం" అని మీరే అన్నారుగా"

"లేకపోతే నీ పెళ్ళాం బాగుండలేదని అంటే బాగుంటుందా?"

"పోనీ! అందుకన్నా బాగున్నదని అన్నారు. నా మటుకు నాకు ఆ పిల్ల లక్షణంగా ఉన్నట్లే కనిపించింది.

"నీకంటేనా?"

"ఆ! నాకంటే కూడా! ఎందుకండీ, ఒకరిని ఇంకొకరితో పోలుస్తారు! ఆడదానికి అందం తెలిసినా ఎదుటి ఆడదాన్ని కూడా అందమైనదనే అంటుంది. అయినా నేను ఆ అమ్మాయి సలక్షణమైనదని మాత్రమే అన్నాను."

"సరేలే- ఆ అందం గొడవ మనకెందుకు?"

"ఆ – అమ్మాయికి అందం లేదని, చదువు లేదనీ కోతపెడతాడుట పాపం! భాస్కరం భార్య చెప్తూ ఏడ్చింది."

"ఓహో! చివాట్లు పెట్టడానికా ఏమిటి? భాస్కరం నిన్న రేపు రమ్మన్నావు"

"మనం చివాట్లు పెట్టేదేమిటి? ఎవరి కర్మ వారిది! పెళ్లి చేసుకున్న తర్వాత ఆజీవిని వేధించకూడదని ఇంగితం ఉండాలి పాపం! తల్లిని, తండ్రిని, అన్నదమ్ములను, అందరినీ వదిలి కదా ఆడది కాపురానికి వచ్చేది. నమ్ముకున్న మగవాడు, ఉదాసీనంగా ఉంటే ఆ ఆడదాని మనస్సెల్లా ఉంటుంది."

* * *

మరురోజు మిళిందకుమార్ తన ఊరు వెళ్ళిపోయాడు. భాస్కరం వచ్చాడు పంకజం ఇంటికి. పిచ్చాపాటీ చాలాసేపు మాట్లాడుకున్న తర్వాత "భాస్కరం! నీ పెళ్లాం చాలా మంచిది. నేను ఎంతో వికారమైనదనుకున్నాను నీ మాటలనుబట్టి. మొత్తంమీద బలే వాడివే! నన్నుదగా చేశావే! అవునులే- ఎవ్వరైనా తన భార్య అందమైనదని చెప్పుకుంటారా" అన్నది పంకజం.

"నిజం నీతోనన్నా, చెప్పుకుందామనుకున్నాను" అన్నాడు భాస్కరం.

మాట నేర్పుతో కాదనలేని స్థితిలో పెట్టాలనుకున్న పంకజానికి భాస్కరం మాటలు తననే ఇరుకులో పెట్టినై.

"భాస్కరం! నీ భార్య అమాయకురాలు. అనాకారి మాత్రం కాదు. నీవు పెళ్లి చేసుకుని నచ్చలేదనడం ఏమీ న్యాయంగా లేదు"

"నేను ఎవరితో చెప్పుకున్నాను? నాకు నచ్చలేదని. నీతో మాత్రమే- పంకజం! పెళ్ళిచేసుకున్నందుకు, ఏదో- సంసారం చేస్తున్నాము!"

"మగవాడు అనాదరంతో చూస్తున్నాడని తోచినపుడు ఆడది ఎంత బాధపడుతుందో నీకు తెలుసునా భాస్కరం!"

"మగవాడూ ఆడదాని మనసు గూర్చి చెప్పేవాడే, ఆడదీ ఆడదాని మనస్సును గూర్చి చెప్పేదే, మగవాడిని మనస్సును గూర్చి ఆలోచన ఎవ్వరికీ అక్కరలేదు. అవును- మగవాడో మ్రానో అన్నారు."

"భాస్కరం! నీవు రేపు వెళ్ళిపోతున్నావు కదూ. నేను నీవు వచ్చేవరకి పురుడు పోసుకువెళ్ళిపోవచ్చు నేను నిన్ను ఒక్కటి కోరుతున్నాను నీవు ప్రేమిస్తున్నా లేకపోయినా నీ భార్య మనస్సు ఏమీ నొచ్చుకుండా ప్రవర్తిస్తానని నాతో మాట అను నేను సంతోషిస్తాను."

"నీవు సంతోషిస్తావా పంకజం"

"సంతోషిస్తాను భాస్కరం"

"నేను అలా చేయడం నీకు సంతోషదాయకం అయితే అలాగే చేస్తాను పంకజం"

"కూర్చో భాస్కరం - కాఫీ త్రాగి వెళుదు గాని."

పంకజం లోపలికి వెళ్ళింది. అద్దంలో చూసుకుంది తన కళ్లు చెమ్మగిలడం. కాఫీ తెచ్చియిచ్చింది భాస్కరానికి తన చేతులతోనే. భాస్కరం అందుకుని కాఫీ సేవించినతర్వాత మౌనంగా వెళ్ళిపోయాడు.

* * *

హైదరాబాదు నగరంలో ప్రతిసంవత్సరం ఎగ్జిబిషన్ జరుగుతూ ఉంటుంది. చిత్రవిచిత్రములైన వస్తువిక్రయశాలలు అందులో ఏటా వెలుస్తూ ఉంటాయి. ఏ ద్వారాన ప్రదర్శనంలోనికి ప్రవేశించాలో, ఏ దారిన బయటకు పోవాలో విద్యుద్దీపాల ధగధగలో తెలుసుకోవడం అంత తేలిక కాదు. నాటకాలు, నృత్యాలు మొదలైనవి ఆ ఆవరణలో ఏర్పాటు చేయడమే గాక, కొన్ని వినోదాలుకూడా ఏర్పాటు చేస్తూ ఉంటారు. వాటిలో రైలు నడిపించడం ఒకటి. అందులో పిల్లలతో ఎక్కింది పంకజం. దుస్తులనుబట్టి, 'ఫలానావారు ఫలానాభాషవార'ని చెప్పడం కష్టం. అందులో హైదరాబాదు ఎగ్జిబిషన్‌లో వివిధభాషల మాట్లాడేవారూ వస్తారు. పంకజం రెండుజడలు వేసుకుని గుజరాతీ దుస్తులలో ఉంది. పిల్లలతో హిందీలోనే మాట్లాడుతూ వుంది. ఇంతలో ఆమెకళ్లు మరొక పిల్లలతల్లిమీద పడినై ఆ అమ్మాయి తెలుగుమాట్లాడుతూ ఇద్దరుపిల్లలనూ చెరో రెక్కతో గుంజుతూ రైలు ఎక్కింది. పంకజానికెదురుగా ఉన్న సీటులోనే కూర్చుంది. ఆ అమ్మాయిని ఎక్కడో చూసినట్లు పంకజానికి మనస్సులో మెదులుతోంది. వెంటనే "మీది ఊరండీ" అని తెలుగులో ప్రశ్నించింది పంకజం. రెండు జడలఆవిడ తనను తెలుగులో పలకరించినందుకు ఆశ్చర్యపడి మాది ఫలానా ఊరు అని చెప్పింది. తనభర్త కాలేజీలో లెక్చరరని చెప్పింది పంకజం ఆసక్తితో పేరడిగింది. వెంటనే ఆమె తన కొడుకును మీ నాన్న పేరుచెప్పమని గిల్లింది. పంకజం పుష్కరం తర్వాత భాస్కరం భార్యను చూడగలిగినందుకు సంతోషించింది.

రైలు దిగినతర్వాత ఒక ప్రక్కన నిలబడి భాస్కరంభార్యకు తనను ఎఱుకపరచుకుంది. భాస్కరంభార్య విస్తుపోయి "నువ్వా అమ్మా పంకజం! నిన్ను రోజూ దీపం పెట్టినప్పుడల్లా తలచుకుంటాను," అంది భాస్కరంభార్య. పంకజం వచ్చి చీర యిచ్చిన రోజునుండి భాస్కరంలో మార్పువచ్చిందనీ, తనను మనిషిగా చూస్తున్నాడనీ పంకజం చేతి చలువను కొనియాడింది. ఆ చీర కట్టుకున్న రోజున భార్యగా చూస్తాడనికూడా [illegible] మనస్సువిప్పి చెప్పేసింది భాస్కరం భార్య. ఆ అమాయికత పంకజానికి నవ్వు రావటమే కాక సిగ్గుకూడా వేసింది. వెంటనే దీర్ఘాలోచనలో పడి, తన భావాలను భాస్కరంభార్యగమనించకుండా భాస్కరంకొడుకులను దువ్వి పేర్లడిగి తెలుసుకుని వారినెత్తుకు ముద్దాడింది. మొన్నటిదాకా తనభర్త బొంబాయిలో ఉద్యోగంచేశాడనీ, ఇటీవలనే హైదరాబాదు బదిలీ అయిందనీ, మళ్ళీ త్వరలో బదిలీ అవుతుందని అనుకుంటున్నారనీ చెప్పింది. పంకజం తన చిరునామా ఇచ్చి భాస్కరంభార్యను తనఇంటికి రావలసిందిగా చెప్పింది.

మరురోజు భాస్కరం, భార్య, పిల్లలూ మిళిందకుమార్ ఇంటికి వచ్చారు. వచ్చేటప్పుడు భాస్కరంభార్య పసుపు, కుంకుమ, ఒక కంచిపట్టుచీర తీసుకొనివచ్చి పంకజానికి ఇచ్చింది పంకజం ఆ చీరను వెంటనే ధరించిందికూడా. మిళిందకుమార్ ఆ రోజు వారిని తన యింట్లోనే భోజనంచేయమని కోరాడు. అందరూ భోజనం చేశారు. ఆరోజు ఆదివారం అవడంచేత ఎవరికీ ఉద్యోగపు తొందరలేక తీరికగా కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. తాను చిన్నప్పుడు ఏరంగు చీరలంటే మోజుపడేదో అదేరంగు జ్ఞాపకం ఉంచుకొని భాస్కరం తెచ్చియిచ్చాడని పంకజం మనస్సులో అనుకుంది. మిళిందకుమార్‌తో తనపిల్లలకు ట్యూషన్ చెప్పవలసిందిగా భాస్కరాన్ని కోరుకోమని సలహా యిచ్చింది. భాస్కరం అందుకంగీకరించాడు.

రెండు సంవత్సరాలు గడిచినై. పంకజం పెద్దకూతురు చంపకానికి, మిగిలిన పిల్లలకు కూడా చదువు చెబుతున్నాడు భాస్కరం. చంపకం పదునాల్గేళ్ళపిల్ల, చురుకైనది. భాస్కరానికి ఆ అమ్మాయంటే ఎక్కువ ఇష్టం, చంపకానికికూడ భాస్కరం బోధన

హోటల్ యజమాని గెస్టుతో;

"ఇదిగో ఇలా చూడండి. ఇవి మా హోటల్ ఫోటోలు. వివిధశాఖలు, గదులు వీటిల్లో ఉన్నాయి. ఇవి మీతో తీసుకువెళ్లండి. ఈ ఫోటోలవల్ల మీకు హోటల్‌ను గూర్చి కొన్ని అభిప్రాయాలు కలుగుతాయి.

గెస్టు:

"ఫోటోలు లేకుండానే నాకు మీ హోటల్ పై కొన్ని అభిప్రాయాలు ఏర్పడ్డయ్. ఎట్లాగో నేను వాటిని కావలసిన వాళ్లందరికీ చెబుతాను పైగా ఫోటోలెందుకూ?"

# ★ తీరని కోరిక

మీద సఖ్యం కుదిరింది. అప్పుడప్పుడు మిళిందకుమార్, పంకజం కూడా వచ్చి కూర్చుని ట్యూషన్ వింటూ ఉండేవారు. నెలనెలా భాస్కరానికి జీతం ముట్టచెబుతూ ఉండేవారు. ఆ జీతం చంపకమే ఇస్తూ ఉండేది. జీతం పుచ్చుకోవడానికి లోలోపల ఇష్టం లేకపోయినా భాస్కరం వద్దని అనలేదు.

ఒకరోజున పంకజం చంపకం పాఠం దగ్గర కూర్చున్నది. పాఠం అయిపోయినతర్వాత భాస్కరం చంపకం తెలివిని మెచ్చుకుంటూ, చిన్నప్పుడు ఆ వయస్సులో పంకజం స్కూలురోజులు జ్ఞప్తికి తెస్తూ, తల్లికంటే కూతురు ఇంకా తెలివికలదని అన్నాడు. పంకజం ఏమీ మాట్లాడలేదు. చంపకం చెక్కిళ్ళలో సిగ్గుపడుతూ పంకజంవంక చూడడం గమనించింది. వెంటనే ఏభావమూ ముఖంమీద కనపడనీయకుండా లోపలకు వెళ్ళిపోయింది. ఆ రోజునుండి ట్యూషన్ చెప్పే వేళలలో అక్కడకు రావడం మాని వేసింది. కాని భాస్కరానికి ఫలహారం, కాఫీ అందేటట్లు శ్రద్ధమాత్రం యథాప్రకారం చూపుతూనే ఉన్నది.

* * *

ఆ రోజు పంకజం ఇల్లు వచ్చేవారితో పోయేవారితో సందడిగా వుంది. కొందరు మిళిందకుమార్‌ను చూడ వచ్చేవారూ, కొందరు మహిళామండలి స్త్రీలు పంకజాన్ని చూడవచ్చేవారూ. మిళిందకుమార్ ప్రమోషన్‌మీద ఢిల్లీకి బదిలీ కావడమే ఆకోలాహలానికి కారణం. ఆ రోజు భాస్కరం కూడా వచ్చాడు. మిళిందకుమార్ భాస్కరాన్ని పట్టుబట్టలతో సత్కరించాడు. మిళిందకుమార్ వెంటనే ఢిల్లీకి ప్రయాణమై వెళ్ళిపోయాడు, మరి రెండు రోజుల్లో కుటుంబాన్ని బయలుదేరి రమ్మని.

పంకజం ప్రయాణానికి ముందు భాస్కరం భార్యవచ్చి చూచివెళ్ళింది. దూరం వెళ్ళిపోతున్నందుకు విచారించింది.

రైలు ప్లాటుఫారంమీదికి వచ్చింది. సామానులు ప్రత్యేక వాగనులో వేశారు. ఫస్టుక్లాసు అంతకుముందే రిజర్వుచేయడంచేత పంకజం, పిల్లలూ రైలులో సుఖంగా ఎక్కారు. ఇంతలో ప్లాటుఫారం మీదికి భాస్కరం వచ్చాడు. చంపకం నమస్కరించి సెలవు తీసుకుంది. పంకజం ప్లాటుఫారం క్రిందికి దిగింది. ప్లాటుఫారంమీద కొంతదూరందాకా నడిచివెళ్ళారు మాట్లాడుతూ పంకజం, భాస్కరం. ఇంకా టైము ఉండడంచేత, ప్రయాణీకులు ఎవరి హడావిడిలో వారు ఉంటూకూడా, బంధువుల దగ్గిర వీడ్కోలు తీసుకోవడం, కష్టసుఖాలు చెప్పుకోవడం చేస్తూనే ఉన్నారు.


భాస్కరం పంకజానికి కృతజ్ఞత వెలిబుచ్చాడు ఇన్నాళ్ళనుండి ట్యూషన్ రూపముతో ఆర్థికంగా సహాయం చేసినందుకు.

"ఏదో చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం. ఈమాత్రం సహాయం ఏం పెద్ద సహాయం భాస్కరం? నాకు సంతోషకరమైన విషయం ఏమంటే నీవు ఆడదాన్ని ఉసురుపెట్టకుండా ఏలుకుంటున్నావు. ఆ అమ్మాయికూడ చాలామంచిది."

"పంకజం! నువ్వు మంచిదానవు కనుక నీకందరూ మంచిగానే కన్పిస్తారు ఆ అమ్మాయికూడ ఒకజీవి. నాకు ఇష్టం లేకపోయినా పెద్దలు పెళ్ళిచేశారు నేను ఎదురుతిరగలేక పోయాను. అందుచేత జీవితాంతంవరకు ఆ అమ్మాయి నాకు పెళ్ళాంఅయి కూర్చుంది."

"పెళ్లి చేసుకోకముందు ఎందుకు ఎదురుతిరగలేకపోయినావు?"

"అది నా దౌర్బల్యం పంకజం! ఎదురుతిరగడం ఎల్లాచేతకాలేదో, కావలసినవస్తువు కావాలని చెప్పడం చేతకాదు పంకజం! నేను మనస్సులో వివాహం చేసుకోదలచుకున్న పిల్లను ఆనాడు అడగగలిగివుంటే, ఈ జీవితమే బలికావలసిన అవసరం లేకపోయేదేమో!"




ఈ వారకు ......., స్త్రీలతో వివాదములు,

— చిత్రం. జె. సత్యనారాయణ, బిలాస్‌పూర్

పంకజం మాట్లాడలేదు.

"నేను అడగగలిగివుంటే, నాతండ్రిని నీతండ్రి అడగగలిగి ఉండేవాడు మనకు వివాహం అయివుండేది. నా జీవితానికది తీరనికోరికగా ఉండిపోయేది కాదు."

"నువ్వు అడగగానే అట్లే అయిపోయి ఉండేది కాబోలు. నేను ఒప్పుకోనక్కరలేదు కాబోలు! నలుగురుబిడ్డల తండ్రివై కూడ ఇంకా చిన్నతనపు కబుర్లూ కోతలూ మానలేదు!"

"పంకజం! నిజంచెప్తా నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. తరుణందాటిన ఇరవై ఏళ్లకయినా, నామనస్సులో మాట చెప్పగలుగుతున్నాను ఇకముందు నీవూ నేనూ జీవితంలో కలియవచ్చు, లేదా కలియక పోవచ్చు. నీవు నన్ను నాభార్యను ఏలుకొమ్మని అధికారం చలాయించినప్పుడు నీమాట విన్నదికూడ నీమీద ప్రేమచేతనే. నీ పిల్లలకు ట్యూషన్ చెప్పడానికి అంగీకరించిందికూడ నీమీద ప్రేమచేతనే. నీకు నామీద ప్రేమలేకపోతే, నాలోని యీ ఊహ చెడుతలపుగా నీకు కనిపించవచ్చు. మంచితనంగా విశపోయే ఈ మంచితనం లో నీవు నన్ను హీనుడిగా చూడవచ్చు. కాని నాకు తృప్తియేమిటంటే నా హృదయాన్ని ఈ వియోగసమయంలో నయినా చెప్పకలిగానని. పంకజం! నీకు నామీద ప్రేమ లేకపోతే లేదని నిర్భయంగా చెప్పు. నిన్ను నేను ఏమీ గర్హించను. ఆకోణంనించి నా జీవితం వెనుకటిపుటలన్నీ ఒక్కసారిగా తిరగేసుకుంటా."

పంకజం మాట్లాడలేదు. ఒక్క నిట్టూర్పు విడిచి "ఎంత పిచ్చివాడవోయీ భాస్కరం" అంది.

"నేను పిచ్చివాడననేమాట నిజం. ప్రేమతో అయిన పిచ్చివాడనా? నీవు నామీద చూపే జాలినిబట్టి నీకుకూడ నామీద ప్రేమవుందని భ్రమపడుతున్నానా అని చాలాకాలంనుంచి ఆలోచించుకుంటున్నాను ప్రేమ, జాలి రెంటికీగల నా స్త్రీనుండి వచ్చేవాక్యాలు ఒకేరకంగా ఉంటై. పంకజం! నీకు నీ సంసారం వుంది. నాకూ నా సంసారంవుంది. జీవితంలో ఎవరిబాధ్యతలు వారు తప్పలేదు. ఇకముందు చెప్పే అవకాశమూ లేదు. ఇద్దరివయస్సూ చాలాభాగం గడచిపోయింది. నా తృప్తికోసం ఒక్కటి నిజం చెప్పు. నీవు నన్ను ప్రేమిస్తున్నావా లేదా? ప్రేమించనిదే ప్రేమిస్తున్నానని అబద్ధం చెప్పి, నేను సంతోషిస్తానని ఆత్మవంచన చేసుకోవద్దు. నిజంగా నువ్వు ప్రేమిస్తే—నీ ప్రియుడికి నీవల్ల ఏ ఉపకారం లేకపోయినా నిజం చెప్పిన ఉపకారమైనా చేయి."

(32-వ పేజీ చూడండి)

## ★ ముమూర్ష ★

(21-వ పేజీ తరువాయి)

నటించాడు. కాస్సేపటికి మళ్ళీ కళ్లు తెరిచాడు. కింకరుడు అక్కడే వున్నాడు. రామ్మూర్తి లేచి అక్కడికి వెళ్ళబోయినాడు గాని, వొంట్లో శక్తి లేదు—లేవటానికి ఓపికా లేదు.

"ఇదిగో" అన్నాడు రామ్మూర్తి నీరసంగా.

కింకరుడు పలకలేదు.

"కింకరుడు గారూ" అన్నాడు మళ్ళీ కాస్త హెచ్చుస్థాయిలో.

"ఏం?" అన్నాడు కింకరుడు అక్కడి నుంచే.

"మాట."

కింకరుడు పర్వతం కదిలినట్టు నడిచివచ్చి, మృగిచెట్టు నించున్నట్టు నిలబడి, "ఏం—ఏమిటి?" అని అడిగాడు గాలివాన వచ్చినట్టు.

"కాదు. నాకు...ఆకలి..." అన్నాడు రామ్మూర్తి మెల్లిగా.

"అయితే ఏం చెయ్యమంటావ్?"

"కాదు. తింటానికేమున్నా..."

"ఇక్కడేం దొరకదు"

"పోనీండి గాని—నన్నెందుకిట్లా బాధిస్తున్నారు?" అని అడిగాడు రామ్మూర్తి.

"పిచ్చివాడా! నువు ఆత్మహత్య చేసుకున్నావయ్యా. అది ఘోరపాపం కదూ! అందుకని పాపఫలం అనుభవిస్తున్నావు"

"ఆఁ!" అన్నాడు రామ్మూర్తి ఆశ్చర్యంగా. "ఎన్నాళ్ళు?" అన్నాడు మళ్లీ,

"చెప్పలేం—పాపం తీరేవరకూనూ"

"అన్నాళ్ళూ ఇట్లా బాధలు పడాల్సిందేనా?" అన్నాడు రామ్మూర్తి కళ్ళమ్మట నీళ్ళు కారగా.

"ఇంకా ఏం చూశావ్! ముందున్నది ముసళ్ళపండగ!" అనేసి సుడిగాలల్లే దూకుడుగా వెళ్ళిపోయినాడు కింకరుడు. రామ్మూర్తి పైప్రాణాలు పైనే ఎగిరిపోయినై.

"ఓయి భగవంతుడా! ఇదివరకే నన్నీ నరకంలో పారేశావుటయ్యా?" అని అరిచాడు... ఏడిచాడు...... మొత్తుకున్నాడు...!

"భూలోకంలో కష్టాలుపడలేకపోయాను. అక్కడి బాధలు భరించలేకపోయాను. పరలోకంలో విముక్తి ప్రసాదించమన్నాను. ఓ దేవుడా! ఇదా నువు చేసిన నిర్వాకం! అక్కడి బాధలూ కష్టాలూ తాళలేక వస్తే—ఇక్కడ ఇంతకన్నా నరకబాధలు పెడుతున్నావా—" అన్నాడు రామ్మూర్తి భోరున. ఈ బాధలకన్నా భూలోకమే సుఖంగా వున్నట్టనిపించింది అతనికి. సుఖపడదామని తను ఆలోకం వదిలివెడితే జరిగింది ఇది! ఎక్కడికి వెళ్లినా తనకు ఈ బాధలు తప్పవా!... రామ్మూర్తికి బోధపడలేదు.

మరికొన్నాళ్లపాటు రామ్మూర్తి ఇట్లాగే నరకబాధలు అనుభవించాడు. అవి మరీ గడ్డుగా దుర్భరంగా వున్నై. తనకష్టం చెప్పుకోటానికయినా ఎవరూ లేని లోకం ఐపోయింది. ఏం చెయ్యాలోనని రామ్మూర్తి రాత్రింబగళ్ళూ ఒకటే దీర్ఘాలోచన చేశాడు!

ఒకనాటి అర్ధరాత్రి రామ్మూర్తి లేచి చూడగా కింకరులంతా నిద్రపోతూ కనిపించారు. రామ్మూర్తి మెల్లిగా లేచి నించున్నాడు. అడుగులో అడుగు వేస్తూ కింకరుల్ని దాటి బయటకు వచ్చాడు. ఎక్కడా ఏ అలికిడీ లేదు—యమలోకం అంతా నిశ్శబ్దంగా వున్నది. రామ్మూర్తికి దివ్యమైన ఆలోచన కలిగింది. ఆలోకమే అనుకుంటే, దానికి మించిపోయి వున్నది ఈలోకం కష్టపెట్టటానికీ, ఏడిపించటానికీ. తను ఈ బాధలు మరి పడలేడు—ఎట్లాగన్నా ఈ లోకంనుంచీ, ఈ కింకరుల బారినుంచి తప్పించుకోవాలి — ఈ కష్టాలనుంచి బైటకొచ్చేయాలి — అనిఅటూ ఇటూ చూశాడు రామ్మూర్తి. యమసదనం ఎత్తుగా గంభీరంగా కనిపించింది. రామ్మూర్తి రెప్ప వాల్చకుండా పైకి చూశాడు...అతని మొహంలో ఇన్నాళ్ళకు చిరునవ్వు కనిపించింది!—ఏదో వూహా తట్టగా.

రామ్మూర్తి నిశ్శబ్దంగా ఆ భవన శిఖరానికి ఎగబ్రాకి పైననించున్నాడు. క్రింద అంతా పెద్ద అగాధంలాగా కనిపించింది. "ఓ దేవుడా! ఈ లోకంలో ఈ బాధలు మరి భరించలేను. నాకు ముక్తిని ప్రసాదించు, నాకు సుఖాన్ని కలిగించు!—" అని ప్రార్థించి, ఎత్తయిన ఆ భవన శిఖరంనుంచి దభీలున దూకేసి 'ఆత్మహత్య' చేసుకున్నాడు రామ్మూర్తి! ★

## ★ తీరని కోరిక ★

(28-వ పేజీ తరువాయి)

పంకజం మౌనం తాల్చింది. "నీకు పిచ్చి ఎక్కుతోంది భాస్కరం. నీతోపాటు నీ భార్యను సేవనుకు ఇరుకున తీసుకొని రానిగా?"

"పంకజం! నన్ను మెలిపెట్టకు. మాటముల పకు. నువ్వు వాక్యమంతా ఉచ్చరించనక్కరలేదు. నీ ప్రేమించడం నిజం అయితే 'నిజం' అని రెండు అక్షరాలు అను చాలు! అబద్ధమయితే ఇంకొక అక్షరం ఎక్కువ 'అబదం' అను చాలు."

ఇంతలో రైలు మొదటిగంట మ్రోగింది. రైలు పెట్టెలోనుండి చంపకం గబగబా పంకజం కేసి నడచివచ్చింది. "గంట మ్రోగింది. మేష్టారూ! నమస్తే! రా! అమ్మా" అని పిలిచింది తల్లిని. పంకజం, చంపకం రైలుపెట్టెలో ఎక్కారు.

"రైలుపెట్టెలో ఎక్కాం. మాష్టారూ! ఇంక బండికదిలేదాకా కబుర్లు చెప్పుకోవచ్చు. బండికదులుతుందేమోనని దిగివచ్చాను మాష్టారూ! క్షమించండి."

పంకజం అంగుళిని ఇలా అంది "మీ మాష్టారికి, సంసారం గొడవతో పిచ్చెక్కిపోయింది. మనం దూరం వెళ్ళిపోతూంటే ఏవో పిచ్చాపాటి చెబుతున్నాడు పాపం! అవును కాని భాస్కరం! మీ శిష్యురాలిని జ్ఞాపకం ఉంచుకుని జాబులు వ్రాస్తూఉండు. ముందుగా అక్కడి చిరునామాతో చంపకమే వ్రాస్తుందిలే ఉత్తరం."

"అల్లాగే" అన్నాడు భాస్కరం.

"నీ పిల్లలకు ఏవైనా సీట్లు, ఉద్యోగాలు కావలసివస్తే వీళ్ల నాన్న సహాయం చేస్తారు. నీవంటే ఆయనకు చాలా యిష్టం. నీ మంచితనాన్ని గురించి ఎప్పుడూ నాతో చెబుతూ ఉంటారు" అంది పంకజం.

"అల్లాగే" అన్నాడు భాస్కరం.

"అల్లాగే కాదు. నిజంగా నీ కవసరం కలిగినప్పుడు వస్తే వారు సహాయం చేస్తారు. నిజంగా,రా."

బండి కదులుతోంది. బండీని అనుసరిస్తున్నాడు భాస్కరం. "దిగపడవోయి, ఇంకా బండి నడుస్తోంది. నిజంగా రావలె నిజం చెప్పమన్నావుగా. నిజం చెబుతున్నాను. నిజం నిజం." నిజంగా ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకున్నారు, పంకజం ఆఖరి వాక్యాలు పలికేటప్పుడు.

ఆ చూపులు వ్యక్తం చేసినది నిజంగా ఇద్దరికీ అది తీరని కోరిక అనా?... ★

★ డిస్మెంసాల్ట్
కుసుమ, బహిష్టునొప్పులకు
అద్భుతముగాపనిచేయును
వివరములకు — AGENTS
R.K.BROTHERS
4/27. RAJAHMUNDRY